
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 3 ఫిబ్రవరి 2024





నరసరావుపేట ప్రాంతంలో శనగ

● బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు లేనట్లే..


అంచనాలకే.. ఆపసోపాలు

● వ్యయం అంచనాల దశ దాటని పనులు

● బుగ్గవాగు పైనే జల జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు ఆధారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తాగు, సాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు దశాబ్దాల కల. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఈ కలకు సాకారం కావడంలేదు. తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని ఆర్భాటంగా ప్రకటించింది. నేటికి కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు వ్యయం అంచనాలు దగ్గరే నిలిచిపోయాయి. బుగ్గవాగు అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది.



బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా

నిలిచిన పనుల వ్యయం అంచనాలు

బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడికాలువ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగించుకోచ్చు. సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తాగు, సాగునీటి అవసరాలు తీర్చవచ్చన్న ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నాయి. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు ఆమోదం తెలిపింది. రూ.424 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రూ.202 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారు. ఐతే 3.46 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచుతామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించి ఇందుకు సంబంధించిన డీపీఆర్ రూపొందించాలని జలవనరుల శాఖను ఆదేశించింది. ఇందు కోసం నిధులు కూడా విడుదలయ్యాయి. 2020 అక్టోబరులో డీపీఆర్ కోసం కాంట్రాక్టర్‌ను నియమించాలని ఇందుకు సంబంధించిన టెండర్‌ను కూడా జలవనరుల శాఖ పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ తప్పుకోవడంతో పనులు వ్యయం అంచనాలు రూపొందించడం నిలిచిపోయింది.

ఏడాదంతా నీరందించే అవకాశం..

బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగునీటి పథకాల అభివృద్ధి ఆధారపడి ఉంది. పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఏడాది పొడవునా తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారం, ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగునీరు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం. బోర్ల నీటి సరఫరాను నిలిపి వేసి సాగర్ నీటిని అందించాలన్న దిశగా ఈ మిషన్ పనులు సాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల జీవన్ మిషన్ పనులు చేపట్టాయి. కాగా పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.1,500 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాలను అభివృద్ధి చేసి బుగ్గవాగు నుంచి పైపులైన్ ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇలా జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై ఆధారపడి ఉన్నాయి. తాగు, సాగు నీటి అవసరాలను తీర్చే బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు కాగితాలకే పరిమితం కావడం గమనార్హం. పనులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వ్యయం అంచనాలు ఎప్పటికి రూపొందిస్తారో వేచి చూడాలి.

రబీలోనూ.. కరువే

ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు కలిసిరాలేదు. రబీలోనూ అదే పరిస్థితి నెలకొంది. రబీ అయినా సాగుకు కలసి వస్తుందని ఆశపడ్డ అన్నదాలకు అడియాశే మిగిలింది. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో సాగుకు నీరులేదు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేశారు. సాధారణం కంటే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 1.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు తగ్గింది. వరి సాగును రైతులు పూర్తిగా కోల్పోయారు. అటు ఖరీఫ్, ఇటు రబీలో తీవ్ర వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

● ఖరీఫ్ మాదిరిగానే తగ్గిన సాగు

● బీళ్లుగా 1.75 లక్షల ఎకరాలు

● గణనీయంగా తగ్గిన వరి, మొక్కజొన్న

● శనగ, పొగాకు సాగు పెరుగుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ నాటితో పోలిస్తే రబీలో కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. సాధారణం కంటే అక్టోబరు, నవంబరులో పల్నాడు జిల్లాలో 52.47 శాతం తక్కువ వానలు కురిశాయి. గుంటూరు జిల్లాలో 62.06శాతం, బాపట్ల జిల్లాలో 56.67శాతం తక్కువ వానలు కురిశాయి. రబీకి కీలకమైన ఈ నెలల్లోనే వానలు లేకపోవడంతో సాగు తగ్గిపోయింది. డిసెంబరు మొదటివారంలో మిచౌంగ్ తుపాను ముంచేసింది. ఈ తర్వాత కూడా సరైన వానల్లేవు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన అతి భారీ వర్షాలు వేసిన శనగ పంటను తుడిచి పెట్టుకుపోయింది. మళ్లీ అదే పొలాల్లో తిరిగి శనగ సాగు చేయాల్సి వచ్చింది. దీంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న ఈ పంట సాగు గణనీయంగా తగ్గింది. వరి సాధారణ విస్తీర్ణం 1,48,239 ఎకరాలు ఉంటే 25,790 ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 17.39 శాతమే వరి సాగు చేశారు. సాగు నీరు సరఫరా లేకపోవడంతో కేవలం బావులు, బోర్లు, వాగుల కింద మాత్రమే వరి సాగు చేశారు. గత ఐదేళ్లలో పరిశీలించినా ఇంత తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసిన దాఖలాలు లేవు.

పెరిగిన శనగ, పొగాకు సాగు...

రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,47,457 ఎకరాలు ఉంటే కేవలం 70,015 ఎకరాల్లోనే సాగు చేశారు. మొక్కజొన్న సాగు దారుణంగా పడిపో యింది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల అనంతరం నీరు అవసరం లేని శనగ పంటను రైతులు విస్తృతంగా సాగు చేశారు. శనగ సాగు గణనీయంగా పెరిగింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,27,555 ఎకరాలు కాగా 1,37,648 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట సాగు బాపట్ల జిల్లాలో భారీగా తగ్గగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గణనీయంగా పెరిగింది. పొగాకు సాగు కూడా పెరిగింది. పొగాకు 21,515 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 42,718 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 21,203 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. బాపట్ల జిల్లాలో అత్యధికంగా పొగాకు సాగు పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటల సాగు భారీగా తగ్గగా శనగ, పొగాకు పంటలసాగు గణనీయంగా పెరిగింది.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాగు లక్ష్యం	విస్తీర్ణం	విస్తీర్ణం	శాతం
పల్నాడు	1,42087	1,35,340	80,792	60
గుంటూరు	1,82,082	1,70,590	1,31,395	67
బాపట్ల	3,89,112	3,68,047	2,76,540	66



నరసరావుపేట ప్రాంతంలో మొక్కజొన్న

ప్రయోగాలకు ఏర్పాట్లు

● 5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

● కేంద్రాల్లో సీసీ కెమేరాలతో పర్యవేక్షణ

● ఫిర్యాదులపై బోర్డు కార్యాలయంలో హెల్ప్‌లైన్

● ఆన్‌లైన్‌లోనే విద్యార్థులకు మార్కుల కేటాయింపు

● ఆంధ్రజ్యోతితో ఇంటర్ బోర్డు ఆర్ఐఒ జుబేర్



గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: ఇంటర్ ప్రయోగపరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు ఆర్ఐవో జుబేర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రతి పరీక్షా కేంద్రం సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫుటేజిని పర్యవేక్షించడానికి ఏర్పాట్లుచేశామని తెలిపారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ ఏడాది ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20వరకు, జనరల్ (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు 11నుంచి 20వరకు విడతల వారీగా పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 9నుంచి 12వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు 2042మంది, జనరల్ విద్యార్థులు 24,360మంది చొప్పున 26,402మంది ప్రయోగ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆ కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారని, ప్రైవేటు కళాశాలలకు మాత్రం ప్రత్యేకంగా చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పరీక్షాకేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పించామని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బైపీసీ విద్యార్థులకు బయాలజీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబుల్లో ఏర్పాట్లుచేశామన్నారు. ఆయా ల్యాబుల్లో పూర్తిస్థాయి పరికరాలు, రసాయనాలు ఉన్నాయని, పరిశీలించిన తర్వాతే ఆయా కేంద్రాలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. తాగునీరు, ఇతర మౌలికవసతులు పక్కాగా ఉండాలని ఆదేశించామన్నారు. ప్రతి కేంద్రంలో 50పైగా విద్యార్థులు ఉంటేనే ల్యాబుకు అనుమతి ఇచ్చామన్నారు. 50మందికంటే తక్కువ ఉంటే ఇతర కళాశాలలకు సంబంధిత విద్యార్థుల్ని కేటాయించేలా ఏర్పాట్లుచేశామని తెలిపారు. పరీక్ష పూర్తైన వెంటనే ఆన్‌లైన్‌లోనే విద్యార్థులకు మార్కులను ఇన్విజిలేటర్స్ కేటాయించి బోర్డుకు పంపుతారని తెలిపారు.

ప్లస్ టూ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లాలో 15 కళాశాలల్లో ప్లస్ టూ విద్యార్థులు ఈ ఏడాది ప్రయోగపరీక్షలకు హాజరుకానున్నారన్నారు. వారి పాఠశాలలకు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వారు ప్రాక్టీసు చేసుకునే ఏర్పాట్లుచేశామన్నారు. ఆయా కేంద్రాల్లోనే షెడ్యూల్ ప్రకారం ప్రయోగపరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. పక్కాగా పరీక్షల నిర్వహణ, ఫిర్యాదులపై సత్వరం స్పందించడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

నిధుల కూత

● కేంద్ర బడ్జెట్‌లో గుంటూరుకు కేటాయింపు ● గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్‌కు రూ.200 కోట్లు

● నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు మార్గాలకూ నిధులు ● మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ నిమిత్తం

గుంటూరు జంక్షన్‌కు రూ.50 కోట్లు



నల్లపాడు- బీబీనగర్ లైన్

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి పెద్ద మొత్తంలోనే కేటాయింపులు జరిగాయి. దశాబ్దాల కల అయిన గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని గత ఏడాది గతి శక్తి స్కీమ్ కింద ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిం చి నిర్మాణం ప్రారంభించేందుకు మార్గం సుగ మం చేసింది. అలానే నిర్మాణ దశలో కొనసాగుతున్న నడికుడి - శ్రీకాళహస్తి సింగిల్ లేన్, గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం ప్రాజె క్టులకు ఆశాజనకంగా నిధులు కేటా యించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఎన్నికలకు ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ని గురువారం పార్ల మెంట్‌లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి జరిగిన కేటాయిం పులు ఆశాజనకం గానే ఉన్నాయి. రైళ్ల పునరుద్ధరణ, పెరిగిన సరుకు రవాణాతో నడికుడి రైలుమార్గం రద్దీగా మారిపోయింది. ఈ నేపథ్యంలో రైళ్ల క్రాసింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దీని వల్ల గమ్య స్థానాలకు కొంత ఆలస్యంగా చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది కేంద్ర ప్రభుత్వం గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని మంజూరు చేసింది. 248 కిలోమీటర్ల పొడవునా నిర్మించాల్సి ఉన్న ఈ రెండో రైలుమార్గం కోసం రూ.2,853.23 కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది. కాగా ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించడం ద్వారా నిర్మాణ పను లకు అడుగులు పడే వాతావరణాన్ని ఆర్థిక మంత్రి కల్పించారు.

ఇక పనులు వేగవంతం..

గుంటూరు-గుంతకల్లు రెండో రైలుమార్గం, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులు కొన్నేళ్లుగా నిర్మాణం జరుగుతున్నాయి. నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గానికి ఈ బడ్జెట్‌లో మూలధనం కింద రూ.150కోట్లు, సేఫ్టీ ఫండ్ కింద మరో రూ.300కోట్లు కేటాయింపులు జరిపింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌కు పెండింగ్ పనులు ఉండగా వాటిని పూర్తిచేసేందుకు రూ.283.50 కోట్లు ఈ బడ్జెట్‌లో పొందుపరిచింది. తద్వారా ఈ రెండు రైలు మార్గాల పనులను మరింత ముందుకు తీసుకెళ్లబోతోన్నామన్న సంకేతాలను కేంద్ర ప్రభుత్వం పంపింది. విష్ణుపురం వద్ద బైపాసు లైను 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించింది. గుంటూరు రైల్వే జంక్షన్‌లో మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ కోసం రూ.50 కోట్లు మంజూరు చేసిం ది. తద్వారా భవిష్యత్‌లో గుంటూరు-గుంతకల్లు, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టులు పూర్తి అయితే ఇక్కడ రైళ్ల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ఉంటుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి.

అమరావతిపై మారని తీరు

అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని కుండబద్దలు కొట్టి చెబుతున్న బీజేపీ మరోవైపు నిధుల కేటాయింపు వచ్చేసరికి సవతితల్లి ప్రేమను చూపుతోంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన అమరావతి రాజధానికి రైలుమార్గం ప్రాజెక్టుకి ఈ బడ్జె ట్‌లో కూడా మొండిచెయ్యే చూపిం చింది. విజయవాడ - గుంటూరు వయా అమరావతి 106 కిలోమీటర్ల రైలు మార్గానికి రూ.2,679.59 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి సర్వే, డీపీఆర్ కూడా ఎప్పుడో సిద్ధమైంది. అయితే నిధులు, భూమిని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్రం షరతు పెట్టడంతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లో పడింది. కనీసం ఎన్నికల సంవత్సరంలోనైనా కొంత నిధులు కేటాయించి రైలుమార్గం నిర్మాణానికి అడుగులు పడేలా చేస్తుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎప్పటిలానే ఈ ఏడాది కూడా బీజేపీ పాలిత ఎన్‌డీఏ ప్రభుత్వం మొండి చెయ్యే చూపించింది.

ఓటరు దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 2: జిల్లాలో ఓటరు దరఖాస్తులను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు పాటిస్తూ సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్‌మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, ఓటర్ల జాబితా నవీకరణ అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలకసంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో చంద్రశేఖరరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఈఆర్వోలు, జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఓటరు దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. చేర్పులు, తొలగింపులపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి రిమార్కులను బూత్ లెవల్ అధికారులకు అందించేలా ఈఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చేర్పులకు సంబంధించిన ప్రతి దరఖాస్తును ఈఆర్వోలు స్వయంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి మాత్రమే పరిష్కరిస్తారన్నారు. అందువల్ల బీఎల్వో, ఏఈఆర్వో, ఈఆర్వో రిమార్కులతో సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సౌకర్యాల పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్ఎస్ఆర్ 2024 ఓటర్ల తుది జాబితాలో ఉన్న ఓటర్ల ఫొటో, చిరునామా వివరాల సవరణలు, డూప్లికేట్, మృతుల ఓట్లు తొలగింపు ప్రక్రియ పదిహేను రోజుల్లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలపై రాజకీయపార్టీల ప్రతినిధులు అభ్యంతరాలను ఎప్పటికప్పుడు విచారించి, తీసుకున్న చర్యల నివేదికను ఈఆర్వోలు అందించాలన్నారు. ఓటర్ల జాబితాపై ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ముసాయిదాను ఈఆర్వోలు ఆదివారం నాటికి అందించాలన్నారు. సునిశిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈఆర్వోలు, సెక్టోరల్ అధికారులు గుర్తించాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.రవీంద్రరావు, లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే లక్ష్మీశివజ్యోతి, ఆర్డీఓ పి.శేఖర్, డీఆర్డీఏ పీడీ వై.హరిహరనాథ్, వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, సీపీవో శేషశ్రీ, విభిన్న ప్రతిభావంతుల ఏడీ సువార్త, డీఈవో శైలజ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

● కొన్ని చోట్ల కాలనీల పేర్లే ఇంటి నెంబర్లు

● మరికొన్ని ప్రాంతాల్లో జనన తేదీ, వాహన నెంబర్ల నమోదు

● రెండు, మూడు చోట్ల అయితే ఫోన్ నెంబర్లను నింపిన బీఎల్‌వోలు

● మరో ఓటరు డోర్ నెంబరుగా సచివాలయం నెంబరు

ఇంటి నెంబర్.. ఇదేంటిలా?

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2024లో భాగంగా డోర్ నెంబర్లపై వచ్చిన ఫిర్యాదులన్నింటిని పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారులు చెప్పిన మాటలు ఒట్టిమూటలుగా మారాయి. ఒక్క గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే కొన్ని పోలింగ్ బూత్‌ల ఓటర్ల జాబితాలు పరిశీలిస్తే లెక్కలేనన్ని తప్పులు వెలుగులోకి వచ్చాయి. వాటిని ఆధారాల సహా ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనాతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసేందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులు సంసిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఈసీ ఆగ్రహానికి ఎవరు బలి అవుతారోనన్న ఉత్కంఠ నెలకొంది. బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు డోర్ నెంబర్ల విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉన్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి.

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని నల్లకుంటలో 222వ పోలింగ్ బూత్‌లో ఓటరు సీరియల్ నెంబరు. 218, 248, 249, 716, 717లకు డోర్ నెంబరు. ఎన్‌జీవో కాలనీ అని నమోదు చేశారు.

● నల్లకుంట, నల్లపాడు 223 పోలింగ్ బూత్‌లో 1వ నెంబరు ఓటరు ఇంటి నెంబరు వద్ద డోర్ నెంబరు అని ఎంట్రీ చేశారు. 1086 సీరియల్ నెంబరులో అయితే డోర్ నెంబరు నింపాల్సిన చోట హౌసింగ్ బోర్డు కాలనీ నాల్గో లైను అని పేర్కొన్నారు.

● 242వ పోలింగ్ బూత్ వడ్డెగూడెంలో అయితే 257వ ఓటరు నెంబరుకు డోర్ నెంబరు స్థానంలో 16/12/1958 అని జనన తేదీని నమోదు చేశారు.

● పోలింగ్ బూత్ నెంబరు. 243లో అయితే 1102 సీరియల్ ఓటరుకు డోర్ నెంబరు. స్థానంలో ఏపీ942384 అని ఉంది.


● పోలింగ్ బూత్ నెంబరు. 246లో 397వ సీరియల్ ఓటరుకు డోర్ నెంబరు వద్ద కేవీపీ కాలనీ రెండో లైను అని చేర్చారు.


● పీఎస్ నెంబరు. 247లో సీరియల్ నెంబరు. వద్ద ఒక చోట 957 అని, మరో చోట ఒకటి అని గడుల్లో నింపారు. డోర్ నెంబరు వచ్చేసరికి పార్వతీపురం ఒకటో లైను అని ఎంట్రీ చేశారు. 295 సీరియల్ నెంబరు ఓటరుకు సంపత్ నగర్ ఏడో లైను, 574కి హౌస్, 575కి సంపత్‌నగర్ ఐదో లైను, 1067 సీరియల్‌కి శ్రీనివాసరావుపేట, 1118కి హౌస్ రేకులు అని నమోదు చేశారు.

● పీఎస్ నెంబరు.249లో 87 సీరియల్ నెంబరు ఓటరు డోర్ నెంబరు. 070948103బీఎల్‌సీ అని ఉంది.

● పీఎస్ నెంబరు. 250లో సీరియల్ నెంబరు. 88 ఓటరు ఇంటి నెంబరు. 07094810బీఎల్‌సీ అని ఎంట్రీ చేశారు.

● పీఎస్ నెంబరు. 252లో సీరియల్ నెంబరు. 810 ఓటరుకు డోర్ నెంబరు వద్ద గుంటక అని ఎంట్రీ చేశారు.





గుంటూరు పశ్చిమలో ఓటరు డోర్ నెంబర్లకు బదులు కాలనీ పేర్లు, మొబైల్ నెంబర్లు, వాహన నెంబర్లు నమోదు చేసిన బీఎల్‌వోలు

● పీఎస్ నెంబరు. 253లో 1174 సీరియల్ నెంబరు ఓటరుకు డోర్ నెంబరు లేకుండా చుట్టుగుంట, కేవీపీ కాలనీ అని, 1523 ఓటరుకు డోర్ నెంబరు బదులు కేరాఫ్ పీఆర్ ఖాన్ అని నమోదు చేశారు.

అధికారులు ఏమి చేస్తున్నట్లు?

ఇన్ని తప్పులతో తుది ఓటర్ల జాబితాలని బీఎల్‌వోలు తయారుచేస్తే వాటిని వడపట్టకుండా గుడ్డిగా ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు ఆమోదించేసి జిల్లా ఎన్నికల అధికారికి నివేదించారు. అన్ని తప్పులను సరి చేశామని అబద్ధాలు కూడా చెప్పారు. ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న ఈ తప్పులకు ఏమి సమాధానం చెబుతారని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర కార్మిక నాయకులు

వడ్డెరలను బెదిరిస్తే సహించం

● దాచేపల్లి వడ్డెర కార్మిక నాయకులు

దాచేపల్లి, ఫిబ్రవరి2: బలహీనవర్గాలకు చెందినవారని వడ్డెర సామాజికవర్గానికి చెందినవారిని బెదిరించి భయపెట్టాలని చూస్తే సహించమని దాచేపల్లి మండల వడ్డెర సంఘ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో దాచేపల్లి వడ్డెర నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వడ్డెర నాయకులు మాట్లాడుతూ గురజాల పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ భర్త మహంకాళి నీలంరాజు వడ్డెర సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలంరాజు శివమాల వేసుకొని ఉన్నా అతన్ని గురజాల నుంచి మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని బెదిరించి దారుణంగా కొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వడ్డెరలకు చెందిన నీలంరాజును మాత్రమే డబ్బులు కక్కిస్తామని బెదిరించడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో 6వ వార్డు కౌన్సిలర్ వేముల కృష్ణ, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి బత్తుల రాంబాబు, మాజీ ఎంపీటీసీ గుంజా పూర్ణ, కుంచపు గంగరాజు, తమ్మిశెట్టి రామకృష్ణ, కొండేపూడి వంశీ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, వేముల నరసింహారావు, ఇర్లా శ్రీను, ఏడుకొండలు, గోగుల శ్రీను, వెంకటరావు తదితరులున్నారు.

హద్దు మీరిన అధికారులపై ఈసీకి ఫిర్యాదు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో హద్దుమీరి ప్రవర్తిస్తున్న ప్రతి అధికారిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం, మద్దిరాల, రాజాపేట, పోతవరం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్తిపాటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో జగన్ వివాదాస్పద అధికారులను కావాల్సిన ప్రాంతాల్లోకి తెచ్చుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారుల నుంచి సీఐ, ఎస్ఐ వరకు వైసీపీ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్టు తెలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో వీళ్ళల్లో ఏ ఒక్కరిని నమ్మే పరిస్థితి లేదని, సమస్యాత్మక ప్రాంతాల్లో వీరి పనితీరుపై తమకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే కోడ్ అమల్లోకి వచ్చిన అనంతరం జగన్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ప్రతి బదిలీని పునఃసమీక్షించాలని, వివాదాస్పద అధికారులను పూర్తిగా పక్కన పెట్టాలని తమ డిమాండ్ అన్నారు. ఈ విషయం పై పార్టీ తరుపున ఈసీని కలవనున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట పార్టీకి పనిచేస్తే పార్టీ గెలుపు సులభం అవుతుందన్నారు. రాబోయే ఎన్నికలకు టీడీపీ, జనసేన శ్రేణులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ కార్యకర్త తోట రాజా రమేష్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షులు జువ్వాజి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుకోట్ల మంది ఆకాంక్ష అమరావతి

● 1508వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 2: రాజధాని అమరావతిని నాశనం చేయాలనుకుంటే వైసీపీ ప్రభుత్వానికి తగిన శాస్తి జరుగుతుందని 33వేల ఎకరాల భూములిచ్చిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు చేపట్టిన ఆందోళనలు, నిరసనలు శుక్రవారం నాటికి 1508వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు జగన్‌రెడ్డి అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానులని నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. విశాఖ, కర్నూలు రాజధానులు పెడతానంటూ అభివృద్ధి లేకుండా చేశాడన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ఆయన అమరావతిని నిర్వీర్యం చేసి వెనకడుగు వేస్తున్నాడన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధిని కొనసాగించమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ఇచ్చినా అమలు చేయాలన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



తుళ్లూరు రైతు ధర్నా శిబబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

నేడు వడ్లపూడి బాబా మందిర వార్షికోత్సవం

● ఏర్పాట్లను పర్యవేక్షించిన పాతూరి నాగభూషణం

మంగళగిరి, ఫిబ్రవరి 2: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం శనివారం జరుగనుంది. ఏటా ఫిబ్రవరి మూడవ తేదీన మందిర వార్షికోత్సవాన్ని ఓ భారీ తిరునాళ్ల మాదిరి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 2006లో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న పాతూరి నాగభూషణం తన స్వగ్రామమైన పెదవడ్లపూడిలో ఈ మందిరాన్ని నిర్మించారు. పక్కనే శ్రీ విష్వేశ్వరస్వామివారి ఉపాలయాన్ని కూడా నిర్మించారు. అప్పటినుంచి ఏటా అటు ఆధ్యాత్మికతను, ఇటు సాంస్కృతిక వైభవాన్ని మేళవించి భారీ తిరునాళ్ల మాదిరి జరిపిస్తున్నారు. మందిరానికి ఎదురుగా ఓ ప్రత్యేక గోశాలను కూడ ఏర్పాటు చేయించారు. ఆంధ్ర షిరిడీగా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. 18వ వార్షికోత్సవానికి అన్నీ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రానికే పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్, జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం రెండు రోజులుగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మందిరానికి ఎదురుగా వున్న ఖాళీస్థలంలో సాంస్కృతిక కళావేదిక ప్రాంగణం, దాని పక్కనే అన్న ప్రసాదశాలను ఏర్పాటుచేయించారు. ఖాళీస్థలంలో పిల్లలకోసం జయింట్‌వీల్ వంటి రంగులరాట్నాలతో కూడిన క్రీడా ప్రాంగణాన్ని అన్ని హంగులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయిస్తున్నారు. మందిరంలో శనివారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచే బాబావారి విగ్రహానికి వివిధ అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు పెద్దఎత్తున అన్నవితరణ గావించేందుకు భారీఏర్పాట్లు చేశారు. సినీ, టీవి కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.



అన్న సంతర్పణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పాతూరి నాగభూషణం

రెండో రోజు.. అదే ఉత్సాహం

● కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్ ● నేటితో ముగియనున్న ఉత్సవాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ నేటితో ముగియనున్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ యువత తమ కలల్ని సాకారానికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు క్రీడా సంబరాల్లో మునిగిపోయారు. బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ ఇలా అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. అంతర్లీనంగా దాగిన కళలు, సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సోలో సాంగ్స్, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ నేటితో ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే. ప్రసాద్, నటుడు కిరణ్ అబ్బవరం, రచయిత బుర్రా సాయి మాధవ్‌లు రానున్నారని వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కబడ్డీలో నువ్వా... నేనా అంటూ..



బాస్కెట్‌బాల్‌లో పోటీలో...

సుందరం మాస్టర్ యూనిట్ సందడి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: విజ్ఞాన్స్ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన తాను... సినీ హీరోగా మీ ముందుకు మీలో ఒకడిగా వస్తున్నాని వర్ధమాన సినీ నటుడు హర్ష చెముడు (వైవా హర్ష) అన్నారు.విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో రెండో రోజు సుందరం మాస్టర్ సినిమా యూనిట్ సందడి చేసింది. హీరో హర్ష మాట్లాడుతూ మీ మీద మీకు నమ్మకం ఉండాలని, మీకు ఏది అనిపిస్తే అదే చేయాలన్నారు. తన సినీ జీవితంలో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని విద్యార్థులకు తెలిపారు. డైరెక్టర్ కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ బ్యాక్ బెంచ్ విద్యార్థులకు, తోటి స్నేహితులకు సపోర్ట్‌గా నిలిస్తే... వారు ఏదో ఒకరోజు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు.




యువత ఫ్యాన్‌షో.. నృత్యాలు, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న వైవా హర్ష

80 కిలోల గంజాయి స్వాధీనం

● కాజ టోల్‌ప్లాజా వద్ద గంజాయి పట్టివేత
● గంజాయి రూ.20 లక్షల విలువ
● పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 2: మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద మంగళగిరి ఎస్ఈబీ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి పట్టుబడింది. మంగళగిరి ఎస్ఈబీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఈబీ డీఎస్ఈవో ఎం.వెంకటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఎస్ఈబీ అధికారులు టోల్‌ప్లాజా వద్ద గురువారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో 76 కిలోల గంజాయిని గుర్తించినట్టు చెప్పారు. వెనుకగా వస్తున్న మరో కారులో 4 కిలోల గంజాయిని గుర్తించడం జరిగిందన్నారు. మొత్తం రూ.20 లక్షల 38 వేల విలువ చేసే 80 కిలోల గంజాయితోపాటు రెండు కార్లు, రూ.13,590 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తిరుపతి జిల్లా శట్టిపల్లె గ్రామానికి చెందిన మన్నెం బత్తయ్య, పొత్తూరు గ్రామానికి చెందిన పసుపులేటి గిరిబాబు, చంద్రగిరి మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన ఎట్టికుప్పం మునిబాలిరెడ్డి, బుచ్చినాయుడుపల్లి గ్రామానికి చెందిన పాకాల రాజశేఖర్ అనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. మరో ఇరువురు నిందితులు విశాఖపట్నం పాకాలపాడు పుత్తాడి గ్రామానికి చెందిన చిన్నా అలియాస్ మంగళపల్లి ప్రతాప్, తిరుపతి జిల్లా చేకూరుపల్లి గ్రామానికి చెందిన కోడిపుంజుల వాసులు పరారీలో వున్నట్టు తెలిపారు. నిందితులు కారు కిరాయిలకు తిప్పుతూ చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీకి అలవాటు పడి వక్రమార్గంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి తిరుపతి జిల్లాలో అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి, మంగళగిరి ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్ఈవో వెంకటేశ్వరరావు

భార్యను కడతేర్చిన భర్త

వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త చంపిన ఘటన పట్టణంలోని మసీదుమాన్యంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామానికి చెందిన అంగలకుదురు పోతులూరయ్యచారి, నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన నాగేశ్వరి(30)లకు పదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా వారిద్దరి మధ్య కలతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నాగేశ్వరిపై గురువారం భర్త గడ్డపారతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. భర్త పోతులూరయ్యచారి పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. మృతురాలికి కుమార్తె కలదు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ మృతి

మాచర్ల, ఫిబ్రవరి 2: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని పశువేముల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. మండలంలోని చింతలతండాకు చెందిన రమావత్ బుజ్జిబాయి(42) తన కుమారుడు బైకుపై మాచర్ల నుంచి స్వగ్రామానికి వస్తుండగా పశువేముల సమీపంలోకి రాగానే ఎదురుగా ఆటో రావడంతో బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో బుజ్జిబాయి తలకు తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుజ్జిబాయి మృతిచెందింది. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ వెంకట కొండారెడ్డి తెలిపారు.

భారీగా గోవా మద్యం స్వాధీనం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: అక్రమంగా గోవా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ.10లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డులోని ప్రియాంక డాబా హోటల్ యజమాని వల్లెం శ్రీనివాసరావు గోవా నుంచి తెచ్చిన మద్యాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అతనిని అరెస్టు చేసి మద్యం సీసాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నగేష్, సిబ్బంది సురేష్ తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరావును అరెస్ట్ చూపుతున్న జిల్లా సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

త్వరలో మల్లాది టీడీపీలో చేరిక



మల్లాది శ్రీమన్నారాయణ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, నటుడు మల్లాది శ్రీమన్నారాయణ త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నారు. ఇప్పటికే ఆయన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో టచ్‌లో ఉన్నారు. 2019 ఎన్నికల్లో మల్లాది వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన విడదల రజినీకి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్ళి పలు టీవీ సీరియళ్ళలో నటిస్తూ వచ్చారు. ఆయన 1985-88 మధ్య గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1985-86లో ఏపీ ఐఐసీ డైరెక్టర్‌గా ఉన్నారు. 1987లో జిల్లా పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసి దొడ్డపనేని ఇందిరపై ఓడిపోయారు. 1995 - 99లో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా వ్యవహరించారు. 1997, 2002లో ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా, స్టేట్ బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2004లో రాయపాటి సాంబశివరావు ప్రోద్బలంతో చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2014లో మల్లాది టీడీపీ విజయానికై ఇక్కడ కృషి చేశారు. గత నాలుగున్నరేళ్ళుగా రాజకీయాలకు దూరంగా ఉన్న మల్లాది ఇప్పుడు టీడీపీ వైపు దృష్టి సారించారు.

రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లపై అపోహలు వద్దు

● ఏపీ సీఆర్‌డీఏ స్పెషల్ ల్యాండ్స్ కలెక్టర్

విజయవాడ, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూసమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్యస్థలాలు భూసేకరణలో ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్టు ఏపీ సీఆర్‌డీఏ ల్యాండ్స్ స్పెషల్ కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్లాట్లు భూసేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లుగా గుర్తించి రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఈ లాటరీ ప్లాట్ల కేటాయింపు అంశంలో మాస్టర్ ప్లాన్‌లో లాంటి మార్పులు జరగలేదన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపులో వారి గ్రామాల్లోనే ప్లాట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో పొరపాట్లను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ జరుగుతుందన్నారు. ఈ-లాటరీకి హాజరయ్యే రైతులకు ఆయా గ్రామాలకు లేఅవుట్ ప్లాన్లు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు సందేహాలుంటే నివృత్తి చేస్తామన్నారు. అయినా ప్రత్యేకంగా రైతుల సౌకర్యార్థం, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఐనవోలు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు-1,2, అనంతవరం, కురగల్లు-1,2, నెక్కల్లు, నిడమర్రు 1,2, వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం -1,2, కొండమరాజుపాలెం, నవులూరు-1,2, లింగాయపాలెం, వెంకటపాలెం, రాయపూడి-1,2 గ్రామాల రైతులకు ఫిబ్రవరి 3, 4న సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ-లాటరీలో పాల్గొనే రైతులు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

నవులూరు, లింగాయపాలెం ఈ-లాటరీ 8కి వాయిదా

ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో భూసమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకు అప్పగించిన రైతులకు కేటాయించబడిన నివేశన, వాణిజ్య స్థలాలు భూసేకరణలో ఉన్నందున, అదింకా పూర్తికానందున రైతులకు కేటాయించేందుకు ఫిబ్రవరి 2న జరగాల్సిన నవులూరు, లింగాయపాలెం గ్రామాల మూడో విడత ఈ-లాటరీ ఫిబ్రవరి 8కి వాయిదా వేసినట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండుసార్లు నోటీసులిచ్చినా రైతులు హాజరుకాకపోవడంతో వారికి మరో అవకాశం ఇచ్చి ఫిబ్రవరి 8న బుధవారం ఉదయం 11 గంటలకు నవులూరు 1,2, మధ్యాహ్నం 12గంటలకు లింగాయపాలెం గ్రామాలకు లాటరీ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



ఏడుకొండలు మృతదేహం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2: పట్టణ శివారు కాలనీ కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద నరసరావుపేట పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కుంచెపు ఏడుకొండలు(55) శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం చవిటిపాలెం గ్రామానికి చెందిన ఏడుకొండలు గత 20 ఏళ్ళుగా నరసరావుపేట పట్టణంలోని బరంపేట శిశుమందిర్ స్కూలు వద్ద నివాసముంటున్నాడు. గురువారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణంలో వెతికారు. శుక్రవారం ఉదయం వినుకొండ రోడ్డులోగల కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు. ఏడుకొండలు ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలా మరేమైనా ఇతర కారణాలు ఉన్నాయా అని పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

రియల్ ఎస్టేట్ మధ్యవర్తి దారుణ హత్య



హత్యకు గురైన రామకృష్ణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మధ్యవర్తిగా పనిచేసే వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో గురువారం అర్ధరాత్రి తరువాత జరిగింది. పట్టణంలోని రంగాకాలనీకి చెందిన చెన్నంశెట్టి రామకృష్ణ (45) రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన ఇంటిని అమ్ముకొని పట్టణంలోని 14వ వార్డులో ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. రామకృష్ణ ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో మృతి చెంది ఉండటాన్ని ఆ ప్రాంత ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. రామకృష్ణ గొంతు కోసి చంపి ఉండటాన్ని గుర్తించారు. మద్యం సేవించేందుకు రామకృష్ణను తీసుకు వచ్చి నమ్మకంగా చంపారని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను కూడా రప్పించి విచారణ చేపట్టారు. రామకృష్ణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,21,141 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,21,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 70,863 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	14500	17000
334	9000	20500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు.5	9500	18000	తేజ	8000	21500
273	12500	20100	బ్యాడిగి	10000	19000
341	8500	20000	దేవనూరుడీలక్స్	11000	18000
4884	10000	19500	తెల్లకాయలు	5000	12000

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

● డ్రైవర్ వేధింపులే కారణం?

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం ఉరివేసుకుంది. ఇది గమనించిన కుటుంబసభ్యులు గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రజాశక్తినగర్‌లో నివాసముంటున్న చెరుకూరి క్రిస్టినా(15) 10వ తరగతి చదువుతోంది. తండ్రి సామ్యేలు హైదరాబాద్‌లో చర్చి పాస్టర్‌గా పనిచేస్తూ తాతయ్య, అమ్మమ్మల వద్ద వుంచి చదివిస్తున్నాడు. మాదినపాడు గ్రామానికి చెందిన కొత్తపల్లి సాగర్ వాహనాలకు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్రిస్టినాను ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా సాగర్ వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులను తట్టుకోలేక క్రిస్టినా ఉరివేసుకొని మృతిచెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తెనాలి క్రైం, ఫిబ్రవరి 2: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన కొలనుకొండ రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. తెనాలి రైల్వే పోలీలు తెలిపిన సమాచారం మేరకు తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలనుకొండ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం 55-60సంవత్సరాల గుర్తు తెలియని మహిళ ఎదురుగా వస్తున్న రైలును గమనించకుండా పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని మృతి చెందింది. మృతురాలికి సంబంధించిన సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.28 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

ఐదేళ్లలో విదేశాల్లో 403 మంది విద్యార్థులు మృతి

● ఎంపీ గల్లా జయదేవ్ ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక సమాధానం

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 2018 నుంచి విదేశాల్లో మరణించిన విద్యార్థుల గురించి గుంటూరు పార్లమెంటు సభ్యుడు గల్లా జయదేవ్ పార్లమెంటులో ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్లలో విదేశాల్లో చదువుతున్న 403 మంది భారతీయ విద్యార్థులు మరణించారని దానికి కేంద్రం సమాధానం చెప్పింది. గడిచిన ఐదేళ్లలో అమెరికా, కెనడా, జర్మనీ, ఇతర దేశాల్లో చదువు, ఉపాధి కోసం వెళ్ళే భారతీయుల్లో చనిపోయిన వారు ఎంత మంది? వారి పట్ల కేంద్ర ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? అని గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. విదేశాలలోవున్న భారతీయ విద్యార్థుల భద్రత భారతదేశానికి అత్యంత ప్రాధాన్యతలలో ఒకటని, 'మిషన్ గంగా/అజయ్' కార్యక్రమాలు అందుకు ఉదాహరణగా పేర్కొంది. భారతీయ విద్యార్థులు, విద్యార్థి సంఘాలతో నిరంతర సంబంధాల కోసం అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, కష్టాల్లోవున్న భారతీయ విద్యార్థులకు అవసరమైనప్పుడు అత్యవసర వైద్యసాయం, బోర్డింగ్, లాడ్జింగ్‌తో సహా అన్నింటికీ కాన్సులర్ సహాయం అందుతుందని ఇప్పటివరకు వివిధ దేశాలనుంచి 2396మంది విద్యార్థులను స్వదేశానికి తిరిగి తీసుకువచ్చామని కేంద్ర విదేశాంగ శాఖ ఆ సమాధానంలో పేర్కొంది.



బాబు ష్యూరిటీ పత్రాలు అందజేస్తున్న నసీర్

జగన్‌ను సాగనంపడానికి మేం సంసిద్ధం

● టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి తాము సైతం సంసిద్ధమంటూ టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా స్థానిక శారదకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు అలవిగాని హామీలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధిని పూర్తిగా నాశనం చేసి ప్రజల ముందుకు సిద్ధం అంటూ జగన్‌రెడ్డి ఏ మొహం పెట్టుకొని వస్తాడని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజాధరణ కోల్పోయి జీరోగామారిన జగన్, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. జగన్‌రెడ్డితోపాటు, ఎమ్మెల్యే ముస్తఫాను సైతం ఇంటికి సాగనంపడానికి తామంతా సంసిద్ధంగా ఉన్నామని నసీర్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దయారత్నం, గోళ్ళ ప్రభాకర్, ముప్పవరపు భారతి, వెంకటేశ్వర్లు, బాబు, విజయ్, వాసు, నరసింహరావు, జనసేన నేతలు కొండూరు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల వ్యాఖ్యలకు చంద్రబాబుకు సంబంధం ఏంటి?

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన కృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేత వైఎస్ షర్మిల వ్యాఖ్యలకు టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏంటి సంబంధం అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2019లో కోడి కత్తి డ్రామా ఆడి అధికారం చేజిక్కించుకున్న సీఎం జగన్‌రెడ్డి ఇప్పుడు ఫ్యామిలీ డ్రామాకు తెరలేపారన్నారు. ఎన్ని వేషాలు వేసినా రాష్ట్ర ప్రజలు మరోమారు జగన్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరని తేల్చి చెప్పారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ తరపున రాజకీయ పోరాటం చేస్తూ ఉంటే సీఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేతలు ఆమెను చంద్రబాబే జగన్ పైకి ప్రయోగించాడని చెప్పడంపై వాళ్లకి పూర్తిగా మతిపోయిందన్న సందేహం కలుగుతుందని ఎద్దేవా చేశారు. జగన్‌కు ఆయన చెల్లికి, తల్లికి మధ్యవున్న విభేదాలకు చంద్రబాబుకు సంబంధం ఏమిటో సీఎం జగన్‌రెడ్డి, సజ్జలలు చెప్పాలని మోహనకృష్ణ డిమాండ్ చేశారు.



అదనపు ఎస్పీ సుప్రజకు వీడ్కోలు సభలో జ్ఞాపిక బహూకరిస్తున్న అదనపు ఎస్పీలు

అదనపు ఎస్పీ సుప్రజకు ఘన వీడ్కోలు

గుంటూరు, ఫిబ్రవరి 2: ఇటీవల జరిగిన అడిషనల్ ఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా ఏసీబీకి బదిలీ అయిన జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజకు శుక్రవారం పోలీసు అధికారులు వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ తుషార్ డూడి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో అంకిత భావం, నిబద్ధత, సమర్థత గల అధికారిణిగా అడ్మిన్ అదనపు ఎస్పీ సుప్రజ పేరు తెచ్చుకున్నారని ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులు కార్యక్రమంలో పోలీసులు ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

నరెడ్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశీకి

రియల్‌ఎస్టేట్ డెవలపర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 2 : రియల్ ఎస్టేట్ డెవలపర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గుంటూరు నరెడ్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశీ అందు కున్నారు. శుక్రవారం న్యూఢిల్లీలోని హోటల్ తాజ్‌ప్యాలెస్‌లో నిర్వహించిన 16వ నరెడ్కో జాతీయ కన్వెన్షన్‌లో గుంటూరుకు చెందిన జ్యోతిర్మయి ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెరవలి నాగ వంశీకి రియల్ ఎస్టేట్ డెవలపర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ చేతుల మీదుగా అందుకున్నారు. గుంటూరు జిల్లా నరెడ్కో ప్రతినిధులు, జ్యోతిర్మయి ప్రాపర్టీస్ సిబ్బంది, బిల్డర్లు తదితరులు నాగవంశీకి అభినందనలు తెలియజేశారు.



కపిల్ దేవ్ చేతుల మీదుగా రియల్ ఎస్టేట్ డెవలపర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకుంటున్న పెరవలి నాగ వంశీ

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ, వేదికపై అదనపు ఎస్పీలు

● సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

● శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ వద్దు

● పోలీస్ యంత్రాంగానికి ఎస్పీ తుషార్ డూడీ దిశానిర్దేశం

గుంటూరు, ఫిబ్రవరి 2: రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సన్నద్ధం కావాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల విధి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేదన్నారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని, ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఎస్పీ సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లు, చోరీకేసు నిందితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం ఎస్పీ తుషార్ డూడిని జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు కలసి పుష్ప గుచ్ఛంతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా జిల్లాలో పని చేస్తున్న అన్ని సబ్ డివిజన్‌ల డీఎస్పీలు, సీఐలు ఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీసు అధికారులు ఎస్పీ తుషార్ డూడికి అభినందనలు తెలియజేశారు. సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ వేంకటేశ్వరరావు, ఎఆర్ డీఎస్పీ శాంతకుమార్, జిల్లా సబ్ డివిజన్ పోలీసు అధికారులు, జిల్లాలోని సీఐలు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటరావు, మినిస్టీరియల్ సిబ్బంది, ఏఆర్ ఆర్ఐలు రాజారావు, థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్, రాఘవయ్య, బ్రహ్మానందం, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు

● కమిషనర్ కీర్తి చేకూరి ● ఓటర్ల తుది జాబితాపై సమీక్ష

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 2: ఓటర్ల డ్రాఫ్టరోల్ అనంతరం చేపట్టిన ఓటర్ల వెరిఫికేషన్, రోల్ ప్రిపరేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించే బీఎల్వోలు, ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు ఈఆర్వో కీర్తిచేకూరి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కళ్యాణమండపంలో పశ్చిమ నియోజకవర్గ బీఎల్వోలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో ఓటర్ల తుదిజాబితాపై బీఎల్వోల వారిగా సూపర్‌వైజరీ అధికారులు నివేదిక ఇవ్వాలని, అలాగే సూపర్‌వైజరీ అధికారుల పనిపై ఏఈఆర్వోలు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఒక్కొక్క బీఎల్వోకు సుమారు వెయ్యి ఓట్లు ఉండగా, డ్రాఫ్టరోల్ వచ్చిననాటి నుండి 6నెలలు సమయం తీసుకున్నప్పటికీ తుదిజాబితాలో తప్పులు వచ్చేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేద న్నారు. ఓటర్ల తుది జాబితా సక్రమంగావచ్చేలా చూడాల్సిన బాధ్యత తనదేనని, అనధికారికంగా ఎవరైనా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత బీఎల్వో, సూపర్‌వైజరీ అధికారి కలసి పరిశీలించాలని, అక్కడి మౌలిక వసతుల పై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో ఏసీ కే.లక్ష్మీ శివజ్యోతి, ఏఆర్వో ఇందిరాదేవి, ఏఈఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్లు, సూపర్‌వైజరీ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

డీసీ, ఆర్వో, ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు ..

ఆసీలు వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, డిప్యూటీ కమిషనర్లకు శుక్రవారం కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆసీల వసూళ్లలో నిర్లక్ష్యం కనబరిచి, జీఎంసీ ఆదాయానికి నష్టం కలిగించేలా వ్యవహరించినందుకు మీపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదని ఆర్‌ఐలు కే.రాజేంద్ర ప్రసాద్, ఏ.శ్రీనివాసరావు, షేక్ సలాం, హయత్బావలి, కరిముల్లాఖాన్, ఆర్వోలు కే.సాంబశివరావు,బాలాజీబాష, ఎం.రెహ్మాన్, డిప్యూటీ కమిషనర్లు,సీహెచ్.శ్రీనివాస్, బీ.శ్రీనివాసరావు, టీ.వెంకటకృష్ణయ్య, డీ.రవీంద్రలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని కమిషనర్ తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాటిబండ్ల విష్ణు తదితరులు

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో

ఎస్‌పీఎస్‌హెచ్‌ఎస్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 2 : గుంటూరు పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో కర్రసాము పోటీల్లో ప్రథమస్థానం సాధించినట్లు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని జగ్వీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. గత నెల 28న స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన 13వ సిలంబం (కర్రసాము) రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో తమ పాఠశాల 6వ తరగతి విద్యార్థిని ఎం. జగ్వీకృష్ణ సింగిల్ స్టిక్, డబల్ స్టిక్ విభాగంలో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులను పొంది జాతీయ స్థాయికి ఎంపికయిందని తెలిపారు.ఈ సందర్భంగా కోచ్‌లు వీ. రామకృష్ణ బీ.కిరణ్ బాబును అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

విద్యార్హత నమోదు కాకుంటే లైసెన్సు రద్దు

గుంటూరు సిటీఫిబ్రవరి 2: విద్యార త సకాలంలో నమోదు చేయించుకోని పక్షంలో లైసెన్స్ రద్దు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్సు డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డీలర్లు తమ లైసెన్స్‌కు విద్యార త నమోదు చేయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం గడువు పెంచిందని, ఈఏడాది జూన్ 30 వరకు సంబంధిత అధికారులు విద్యార్హత నమోదు చేస్తారని తెలిపారు. డీలర్లు అప్రమత్తమై నమోదు చేయించుకోని పక్షంలో లైసెన్స్ రద్దు అవుతుందని వెంకటనాగిరెడ్డి స్పష్టం చేశారు.

ప్రయోగ పరీక్షలపై అధ్యాపకులకు శిక్షణ

● ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో జీకే జుబేర్

గుంటూరు(విద్య),ఫిబ్రవరి2: ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి నిర్వహించే ప్రయోగ పరీక్షలకు సంబంధించి సైన్స్ అధ్యాపకులకు శనివారం ఉదయం 11 గంటలకు గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో శిక్షణా కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో జీకే జుబేర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు ఈ ఏడాది నిర్వహించే ప్రయోగ పరీక్షల్లో మార్పులు,మార్కులు నమోదు చేసే విధానం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాల నుంచి సైన్స్ అధ్యాపకులు ఈశిక్షణా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లను కోరారు. గురువారం ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఎథిక్స్ అండ్ వాల్యూస్ పరీక్షకు 30,833 మంది హాజరు కావాల్సి ఉండగా 30,591 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో జీకే జుబేర్ తెలిపారు.

పర్యావరణ విద్య పరీక్ష వాయిదాపై ప్రచారం చేయాలి

ఇంటర్ విద్యార్థులకు ఈనెల 3వ తేదీన నిర్వహించాల్సిన పర్యావరణ విద్య పరీక్ష వాయిదా పడిన విషయం గ్రామీణ స్థాయిలో విద్యార్థులకు అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ తెలియజేయాలని ఆర్‌ఐవో జుబేర్ సూచించారు. అనివార్య కారణాలతో వాయిదా పడిన పర్యావరణ విద్య పరీక్షను ఈనెల 23న ఇంటర్ బోర్డు నిర్వహిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

జీఎంసీ లీజుకిచ్చిన స్థలంలో అనధికార నిర్మాణాలు

● టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే పనులు ?

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 2 : గుంటూరు నగర పాలక సంస్థకు చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్న ఓ సంస్థ అనుమతి లేకుండా ఆ స్థలంలో నిర్మాణాలు చేపడుతుంది. నగరంలోని అమరావతి రోడ్డులో 2000 గజాలకు పైగా జీఎంసీ స్థలాన్ని చైతన్య మీడియా సొల్యూషన్స్ అనే సంస్థ 2020లో అప్పటి ప్రత్యేక అధికారుల పాలనలో 15 ఏళ్ల కాల పరిమితి మేరకు లీజుకు తీసుకుంది. గడిచిన నాలుగేళ్లుగా ఆ స్థలంలో అనేక నిర్మాణాలు చేపట్టింది. తాజాగా మరో భారీ నిర్మాణాన్ని చేపట్టింది. అయితే టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ కట్టడాలు నిర్మించారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై సంబంధిత ఏసీపీ మురళినీ వివరణ కోరగా.. జీఎంసీకి చెందిన ఆ స్థలాన్ని లీజుకి ఇచ్చామని, అందులో జరిగే నిర్మాణాలకు అనుమతి లేదని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ర్యాలీలో బోనబోయిన, మ్యానీ తదితరులు

ప్రజలను చైతన్యవంతం చేయటమే లక్ష్యం

● 'జనంతో జనసేన' ప్రచారంలో బోనబోయిన

గుంటూరు, ఫిబ్రవరి 2: జనసేన అధినేత పవన్ కల్యాణ్ విధానాలను వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా, జనంలో జనసేన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం 49వ డివిజన్ వేళాంగిణి నగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద జనంతో జనసేన ర్యాలీని ఆయన ప్రారంభించారు. జనసేన సిద్ధాంతాలను, తమ కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు, నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్, 49వ డివిజన్ అధ్యక్షుడు అశోక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల మ్యానీ, జనసైనికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఫిబ్రవరి 2: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రాడీపేట 4వ లైనులో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ-8 సెక్షన్ ఏఈ చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని ప్రజలను కోరారు.

బలహీనపరిచే కుట్రలు చేస్తే సహించం

గుంటూరు, ఫిబ్రవరి 2: గుంటూరు నగర రజక సేవా సంఘాన్ని కొందరు నేతల అండదండలతో బలహీనపరిచే కుట్రలు సాగుతున్నాయని, వాటిని సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు హెచ్చరించారు. పాత గుంటూరులోని గంగానమ్మ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం సంఘంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇటీవల గుంటూరు గణేష్‌బాబు అనే సంఘీయుడు చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామని, గతంలో ఆయన సభ్యత్వాన్ని సైతం రద్దు చేశామని గుర్తుచేశారు. రజక సంఘాన్ని రజకులే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో రజకసంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. విలేకంపల సమావేశంలో ఉమామహేశ్వరరావు, గుంటూరు నరసింహారావు, వీరవల్లి శ్రీనివాసరావు, గంధంగోపి, దుర్గాప్రసాదర్ పాల్గొన్నారు.

'దగా డీఎస్సీతో' జగన్‌రెడ్డి మరో వంచన

● తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతల వినూత్న నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'మెగా డీఎస్సీ' పేరుతో 'దగా డీఎస్సీ' విడుదలచేసి యువతను సీఎం జగన్‌రెడ్డి మరోమారు వంచన చేస్తున్నాడని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ ఆరోపించారు. టీడీపీ పిలుపు మేరకు గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత వినూత్న నిరసన తెలిపింది. గాల్లో కోళ్లను వేలాడదీసి కోడికూరను ఊహించుకుంటున్నట్లు నేతలు దగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లుగా ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయకుండా రాష్ట్ర యువతను మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇప్పుడు ఎన్నికలకు రెండు నెలల ముందు 6,100 పోస్టులు భర్తీ చేస్తామని కొత్త నాటకాలకు తెర తీశారని ఆరోపించారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి మాట్లాడుతూ.. ప్రజలను ఇంతగా మోసం చేసిన సీఎం చరిత్రలో ఎవరూ లేరన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నేత మన్నవ వంశీకృష్ణ మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఎక్కడ అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. కార్యక్రమంలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఎం. శ్రీనివాసరావు, అమృతరావు, ధర్మతేజ, గోపికృష్ణ, షకూర్, మన్నెం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగు యువత, జనసేన నేతలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్న డీటీసీ కరీం

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

● కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి

● జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి2: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన కంటి పరీక్షలు, రక్తదాన శిబిరాలను డీటీసీ కరీంతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు నివారణ లక్ష్యంతో జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవ సంస్థలు, మేధావులు, విద్యావంతులు పాల్గొనాలని కోరారు. అనంతరం డీటీసీ కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. డీటీసీ కరీం మాట్లాడుతూ జీజీహెచ్, శంకర్ నేత్రాలయం సహకారంతో రక్తదాన, కంటి పరీక్షల శిబిరాలను ఏర్పాటు చేసామని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్‌సంయుక్త ఉపరవాణ కమిషనర్ కృష్ణవేణి, గుంటూరు, తెనాలి, మంగళగిరి ఆర్టీవోలు గోపాల్, ప్రసాద్, విజయసారధి, మోటారు తనిఖీ అధికారులు రాఘవరావు, మల్లేశ్వరి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

గుంటూరు ఫిబ్రవరి 2: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా లాలాపేట, పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లకు సీఐలుగా నియమితులైన దేవ ప్రభాకర్, విజయచంద్రలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2004లో ఎస్‌ఐగా ఎంపికైన దేవ ప్రభాకర్ ప్రకాశం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించారు. 2013లో ఆయన సీఐగా ఉద్యోగోన్నతి పొంది ఒంగోలు, సింగరాయకొండ, గిద్దలూరు, ఎర్రగొండపాలెం తదితర స్టేషన్లలో పని చేశారు. విజయ్ చంద్ర 2007లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఈయన కూడా ప్రకాశం జిల్లాలోనే ఎక్కువ కాలం పని చేశారు. 2016లో ఆయన సీఐగా ఉద్యోగన్నతి పొంది గుంటూరు స్పెషల్ బ్రాంచ్, చిలకలూరిపేట, సత్తెనపల్లి టౌన్, రేపల్లె తదితర పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ/టీఎస్పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సాంప్రదాయేతర శక్తి వనరులు

సాంప్రదాయేతర శక్తి వనరులు ఎల్లప్పుడూ లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పునరుద్ధరణ(*Renewable*) శక్తి వనరులు అంటారు. వీటిని ప్రత్యామ్నాయ శక్తి వనరులు అని కూడా అంటారు. ప్రత్యామ్నాయ శక్తి వనరులకు ఉదాహరణలు..

- జల విద్యుత్ శక్తి(Hydro Electricity)
- సౌర శక్తి(Solar Energy)
- పవన శక్తి(Wind Energy)
- అలల శక్తి(Wave Energy)
- వేలాతరంగా శక్తి(Tidal Energy)
- భూతాప శక్తి(Geothermal Energy)



- బయోమాస్(Biomas)
- OTEC(Ocean Thermal Energy Convertion)

1981లో ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం DNES (Departmen of Conventional Energy Sources) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

జల విద్యుత్: 2019 నాటికి మన దేశంలో మొత్తం జల విద్యుత్ ఉత్పత్తి- 45,293 మెగా వాట్లు. జలవిద్యుత్ ఉత్పత్తిలో పంజాబ్, కర్ణాటక అగ్ర స్థానాల్లో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తికి 1975లో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాసాగర్ దేశంలో అత్యధిక జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు. దేశంలో మొదటిసారిగా జల విద్యుత్‌ను జనరేటర్ల సహాయంతో 1889లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో గల 'లోనాపల' వద్ద ఉత్పత్తి చేశారు. మొట్టమొదట జల విద్యుత్ కేంద్రాన్ని 1902లో కర్ణాటకలోని మైసూర్ వద్ద ఉన్న శివన్నసముద్రం వద్ద కావేరీ నదిపై నిర్మించారు. ఈ జల విద్యుత్ కేంద్రం కర్ణాటకలోని కోలార్ బంగారు గనికి విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలో అత్యంత ఎత్తుగల జలవిద్యుత్ కేంద్రం - నాత్పా జాక్రీ(హిమాచల్ ప్రదేశ్). కేరళ 100 శాతం జల విద్యుత్ పైనే ఆధారపడ్డది. జల విద్యుత్‌ను తెల్ల బొగ్గు అని కూడా అంటారు. ప్రపంచ జల విద్యుత్ ఉత్పత్తిలో మనదేశం ఆరో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం త్రీ గార్జెస్. దీని ఉత్పత్తి సామర్థ్యం 22,500 మెగావాట్లు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రెజిల్‌లోని ఇటైపు వద్ద నిర్మించారు. దీని సామర్థ్యం 14,000 మెగా వాట్లు.

సౌర శక్తి: 2019 నాటికి మొత్తం సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 28,180.71 మెగా వాట్లు. సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం అధికంగా గల రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ. కొచ్చి(కేరళ) విమానాశ్రయం సౌర విద్యుత్‌తో నడుస్తోంది. 2020 జూన్‌లో ఆసియాలోనే అతి పెద్ద సోలార్ ప్లాంట్‌ను మధ్యప్రదేశ్‌లోని 'రివా'లో ప్రారంభించారు. దీనిని 500 హెక్టార్ల విస్తీర్ణంలో 700 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. సౌర శక్తి ఉత్పత్తిలో అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వరుస స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఎనిమిదో స్థానం లో ఉంది. మొట్టమొదట సౌరశక్తి కేంద్రం జమ్మూ కశ్మీర్‌లోని చొగ్లాంసర్ వద్ద నిర్మించారు. ఆసియాలో నే అతిపెద్ద సౌర తటాకం(Solar Pond) గుజరాత్‌లోని భుజ్ వద్ద ఉంది.

పవన శక్తి: దేశ పవన శక్తి ఉత్పత్తి సామర్థ్యం 35,625 మెగావాట్లు. ప్రపంచంలో పవన శక్తి ఉత్పత్తిలో చైనా మొదటి, భారత్ నాలుగో స్థానాల్లో ఉన్నాయి. దేశంలో పవన శక్తి ఉత్పత్తిలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో పవన విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటున్న ప్రాంతం జోగిమట్టి(కర్ణాటక). దేశంలో మొట్టమొదటి పవన శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని మాండవి వద్ద 1986లో నిర్మించారు. దేశంలో అతిపెద్ద శక్తి కేంద్రం తమిళనాడులోని ముప్పాండల్ వద్ద ఉంది.

అలల శక్తి: మొట్ట మొదటి అలల శక్తి కేంద్రాన్ని కేరళలోని తిరువనంతపురం వద్ద గల విజింజీం వద్ద నిర్మించారు.

వేలాతరంగ శక్తి: ఆసియాలోనే మొట్టమొదటి వేలాతరంగ విద్యుత్ కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా వద్ద నిర్మించారు. వేలాతరంగ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు- గల్ఫ్ ఆఫ్ కచ్(1200 మెగావాట్లు), గల్ఫ్ ఆఫ్ కంబట్(7000 మెగావాట్లు), సుందర్ బన్స్.

భూతాప శక్తి: భారతదేశంలో ఏకైక భూతాప శక్తి కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని 'మణికరణ్' వద్ద ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్‌లో గల పూగా లోయ కూడా భూతాపశక్తి ఉత్పత్తికి అనుకూలమైంది. భారత్‌లో 45,000 మెగా వాట్లు జియో థర్మల్ ఉత్పత్తికి అవకాశం ఉంది.

బయోమాస్: దీనిని వ్యర్థ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. మొట్ట మొదటి బయోమాస్ విద్యుత్ కేంద్రం పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిర్మించారు. బయోమాస్‌లో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటాయి.

OTEC(Ocean Thermal Energy Convertion): దీనిని సముద్రపు నీటి ఉష్ణోగ్రతల వ్యత్యాసం ఆధారంగా ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే మొట్టమొదటి OTEC కేంద్రం తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద అమెరికా సహాయంతో నిర్మించారు. ప్రస్తుతం భారతదేశంలో ఐదు ప్రాంతీయ గ్రిడ్స్ ఉన్నాయి.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ.

నిట్ వరంగల్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ



వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ వరంగల్)- ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది.

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి 12 రోజులు. ప్రతి ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఐఐటీలు, ఐఐఐటీలు, నిట్ సంస్థల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ మెంబర్లు సెషన్స్ నిర్వహిస్తారు. ఇంజనీరింగ్/ఎంసీఏ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, పీజీ చదువుతున్నవారు, పీహెచ్‌డీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

స్మార్ట్ కాంట్రాక్ట్ మాస్టరీ:పయనీరింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్

సంస్థ ఆధ్వర్యంలోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్, ఈ&ఐసీటీ అకాడమీలు ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నాయి. ఇందులో బ్లాక్ చెయిన్-కరెంట్ అండ్ ఫ్యూచర్ అప్లికేషన్స్, ఇన్ఫర్మేషన్ అటెస్టేషన్ అండ్ మల్టీ ప్రొటోకాల్ స్టోరేజ్ ఫర్ వెబ్, బ్లాక్ చెయిన్-క్వెరీ లాంగ్వేజ్, బిజినెస్ నెట్‌వర్క్స్ అండ్ ప్రాసెస్ బేస్డ్ ఆన్ మోడలింగ్ అండ్ బ్లాక్ చెయిన్ తదితర అంశాలు వివరిస్తారు. టెస్టింగ్ టూల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20

ఆప్టిమైజేషన్ టెక్నిక్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్

ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని ఈ&ఐసీటీ అకాడమీ నిర్వహిస్తోంది. ఇందులో డైరెక్ట్ సెర్చ్ మెథడ్స్, గ్రేడియంట్ బేస్డ్ మెథడ్స్, సింపుల్ మెథడ్ అండ్ లీనియర్ ప్రోగ్రామింగ్, జెనెటిక్ అల్గారిథమ్, పార్టికల్ ఆప్టిమైజేషన్, డిఫరెన్షియల్ ఎవల్యూషన్, కాలనీ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, సిమ్యులేటెడ్ ఎనీలింగ్ అల్గారిథమ్ తదితర అంశాలు వివరిస్తారు. సాఫ్ట్ కంప్యూటింగ్, మెటా ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లకు సంబంధించిన కేస్ స్టడీస్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 11 నుంచి 22 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **వెబ్‌సైట్:** nitw.ac.in

నార్మ్‌లో పీజీడీఎం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్, 12 వారాల బిజినెస్ బూట్ క్యాంప్, 13 వారాల ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. ఇందులో మొత్తం 66 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత: యూజీసీ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫిషరీస్, ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, సెరికల్చర్, వెటర్నరీ సైన్స్, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి ఒకదానిలో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు వర్తిస్తుంది. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి. సంబంధిత రంగంలో కనీసం ఆర్నెల్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/K1ylmt7లో చదవండి.

ఐఐఎం రోహ్‌తక్‌లో ఐపీఎం

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అయిదేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో రాణించాలనుకొనే వారికి ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐపీఎం ఏటీ) 2024, పర్సనల్ ఇంటర్వ్యూ, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 165 సీట్లు ఉన్నాయి. మొదటి మూడేళ్ల తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 30 నాటికి 20 ఏళ్లు మించకూడదు.

ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీఎం ఏటీ) 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. సెక్షన్‌కు 40 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 6 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.4,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 10
- **ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024:** మే 18 నుంచి
- **వెబ్‌సైట్:** iimrohtak.ac.in

నవ్య | చిత్రజ్యోతి

2025

జనవరి 10న విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా టైటిల్ టీజర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు చిరంజీవి. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ఠ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్‌తో కొత్త ప్రపంచం సృష్టించారు. ఈ సినిమా షూటింగ్‌లో మెగాస్టార్ శుక్రవారం అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకూ నటించిన చిత్రాల్లో ఇదే కాస్ట్లీయస్ట్ ఫిల్మ్. వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర'ను విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: శివశక్తి దత్తా, చంద్రబోస్, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరావు, సంతోష్ కామిరెడ్డి.

అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు



లావణ్య

'వరుణ్‌తేజ్‌తో పెళ్లయిన తర్వాత కెరీర్ పరంగా ఏమీ మార్పు లేదు.. మెగా కుటుంబంలోకి వచ్చాక 'నువ్వు ఇలా చేయాలి.. అలా చేయాలి' అని ఎవరూ నాకు చెప్ప లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మా వరకూ గతంలో లాగానే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగుపెట్టడం మంచి అనుభూతినిచ్చింది. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్‌లో వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్స్‌లో వరుణ్ ఇన్‌వాల్వ్ కాడు. 'మిస్ పర్ఫెక్ట్ స్క్రిప్ట్ చదివి బాగుందన్నాడు' అని చెప్పారు లావణ్య. తను హీరోయిన్‌గా నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు.

- 'ఈ సిరీస్‌లో మంచి నటులు ఉన్నారు. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన మంచి స్క్రిప్ట్ ఇది. ఇలాంటి స్క్రిప్ట్ నా దగ్గరకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నేను 'మిస్ లావణ్య, లక్ష్మి' అనే పాత్రలు చేశాను. అన్ని రకాల ఎమోషన్స్ ఈ పాత్రల్లో ఉన్నాయి. నా పర్సనల్ లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్రలివి. సినిమాలకు, వెబ్ సిరీస్‌కు పెద్ద తేడా కనిపించలేదు. సినిమా షూటింగ్ జరిగినట్టే ఈ వెబ్ సిరీస్ వర్క్ కూడా జరిగింది' అని చెప్పారు లావణ్య
- 'కొత్త దర్శకులతో పని చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. మా దర్శకుడు విశ్వక్ ఖండేరావు రైటింగ్ యూనిక్‌గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఎవరు సలహా చెప్పినా స్వీకరించేవారు. పర్ఫెక్షనిస్ట్‌గా ఉండడం వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఈ సిరీస్‌లో చూస్తారు' అని ఆమె అన్నారు. నిర్మాత సుప్రియ తనకు మంచి స్నేహితురాలు కావడంతో ఈ సిరీస్ కంఫర్ట్‌గా చేశానని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త హీరోతో నిర్మించే చిత్రంలో నటించనున్నట్లు లావణ్య చెప్పారు. ఇందులో తనది పోలీస్ ఆఫీసర్ పాత్ర అన్నారు. దీంతో పాటు ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నట్లు వెల్లడించారు.

వేసవిలో వస్తున్న ఫ్యామిలీ స్టార్



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విడుదల తేదీని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 5న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ ఉన్నారు. రిలీజ్ డేట్ ప్రకటించిన సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని భుజాన గోనె సంచీ, ఆధార్ కార్డ్‌తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/lb27nMSలో చదవండి.



22న గోవాలో రకుల్ పెళ్లి



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి ముహూర్తం ఖరారు అయింది. తన ప్రియుడు, నిర్మాత, నటుడు జాకీ భగ్నానితో ఆమె వివాహం ఈ నెల 22న గోవాలో జరుగనుంది మిడిల్ ఈస్ట్‌లో ధూమ్‌ధామ్‌గా డిస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని మొదట రకుల్, ఆమె బాయ్ ఫ్రెండ్ అనుకున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ డెస్టినేషన్ వెడ్డింగ్స్ విదేశాల్లో కాకుండా మన దేశంలోనే నిర్వహించాలని ఇటీవల .విజ్ఞప్తి చేయడంతో రకుల్, జాకీ తమ ఆలోచన మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి తర్వాత ముంబైలో రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి టాలీవుడ్, బాలీవుడ్‌లోని చిత్ర ప్రముఖులందరినీ ఆహ్వానించాలని కూడా వారు అనుకున్నారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబైలో కానీ మరెక్కడ కానీ వీళ్ల పెళ్లి రిసెప్షన్ జరగడం లేదు.

గ్రామీణ ప్రేమకథ



వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్ బాగుందనీ, సినిమా విజయం సాధించాలనీ ఆయన కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న ప్రేమకథ ఇది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, తను అనుకున్న విధంగా సినిమా తీయడానికి నిర్మాత ఎంతో సహకరించారనీ దర్శకుడు తెలిపారు. దీప్తి, మేకా రామకృష్ణ, జయప్రకాశ్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం: చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే.

యువతను మెప్పించే రేవ్ పార్టీ

క్రిష్ సిద్ధిపల్లి

'నేను లేని నా ప్రేమకథ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు క్రిష్ సిద్ధిపల్లి. ఆయన కథానాయకుడిగా రూపొందిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రిష్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- హీరో అవ్వాలనేది నా కోరిక. కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాలకు సహాయ దర్శకుడిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత నటుడిగా చిన్నపాత్రలు పోషించాను. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు వస్తున్నాయి. నేను హీరోగా నటించిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. యువతను ఆకట్టుకునే వినూత్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు బొనగాని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రితిక చక్రవర్తి, ఐశ్వర్యగౌడ హీరోయిన్లు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఉడుపి, గోవా, బెంగళూరు ప్రాంతాల్లో ఎక్కువగా రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. అందుకే ఆ ప్రాంతంలోని ఒరిజినల్ లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రేవ్‌పార్టీలు ఎలా జరుగుతాయి?, వాటి వెనుక ఎవరు ఉంటారు, యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, వైద్యశాల అధికారులు తదితరులు

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి

● సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 2: అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించి ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు భరోసా నింపాలని సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సబ్‌కలెక్టర్ వైద్యశాలలో అందుబాటులో ఉన్న వైద్యసేవలు, ల్యాబ్ పరీక్షలు, మందులు, ఓపీ వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి ఇతర అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్‌కలెక్టర్‌గా తెనాలిలో బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిగా సమావేశానికి రావడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో పేదలందరికీ మంచి వైద్యసేవలందించేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పలువురు వైద్యశాల అధికారులు పాల్గొన్నారు.



స్వామి వారికి నివేదించిన లక్ష లడ్డూలు, కుంకుమార్చనకు హాజరైన మహిళా భక్తులు

వేంకటేశ్వరునికి విశేష అభిషేకం, కుంకుమార్చన

● భారీ సంఖ్యలో హాజరైన మహిళలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం విశేష అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా జరిపారు. తెనాలి కొత్తపేట తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న శ్రీవేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలలో భాగంగా జరిగిన కుంకుమార్చనకు భారీఎత్తున మహిళా భక్తులు హాజరయ్యారు. వేకువజామున తిరుమలలో జరిగిన విధంగా సుప్రభాత సేవ, తోమాలసేవ, బాలభోగం, నవనీత హారతి, దివ్య ప్రబంధం, కొలువార్చన నిర్వహించారు. ఏకాంత సేవతో పాటు యాగశాలలో గణపతి, సుదర్శన, నవగ్రహ హోమాలు మూల మంత్రంతో జరిపించారు. బాలస్వామిజీ, బాచంపల్లి సంతోష్‌కుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. విశ్వశాంతి ఆశ్రమ ట్రస్టు నిర్వాహకులు విజయేశ్వరిదేవి 10వేల మంది మహిళా భక్తులతో లలితాసహస్రనామ పారాయణ చేయించారు. డాక్టర్ అనంతలక్ష్మి వేంకటేశ్వర వైభవాన్ని వివరించారు. శనివారం పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించాలని, సాలిగ్రామ మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి కోరారు. కార్యదర్శి నాగేశ్వరరావు, సహ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, శివప్రసాద్, రాజేశ్వరరావు, రామకృష్ణ పర్యవేక్షించారు.

తెనాలి ఎంపీడీవోగా కానూరి శిల్ప

తెనాలి రూరల్, ఫిబ్రవరి 2: తెనాలి ఎంపీడీవోగా కానూరి శిల్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె కంచకచర్లలో ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. బదిలీల్లో భాగంగా ఆమె తెనాలి వచ్చారు. కార్యాలయ సిబ్బంది మండలంలోని పలువురు పంచాయతీ అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీవో శిల్ప ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిపుష్పగుచ్ఛం అందించారు.



ఎమ్మెల్యే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీవో కానూరి శిల్ప



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే, కరస్పాండెంట్ శివకుమార్

61 మంది ఏఎస్ఎన్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 61మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. బీకాం, బీసీఏ, బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు మల్టీనేషన్ కంపెనీ సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.3లక్షల వేతనం వస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ కె.రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి

● కాంగ్రెస్ కన్వీనర్ సాంబశివుడు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపారని, విభజనకు గురైన రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత లేకుండా ప్రవర్తించారని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు విమర్శించారు. మారీసుపేట కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, హోదా ఇవ్వకుండా ప్యాకేజీ కూడా లేకుండా చేశారని, కనీసం బడ్జెట్‌లోనైనా ఊరట ఇచ్చే అంశం ఒక్కటి కూడా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సాగిల పడిందని, ఎన్నికల ముందు ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతామన్న ముఖ్యమంత్రి తన మెడవంచి లొంగిపోయి రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆరోపించారు. రాజధాని అమరావతికి ఎలాంటి సాయం అందించకుండా ముఖ్యమంత్రి ఆడుతున్న మైండ్‌గేమ్‌కు కేంద్రం తందానా పాడిందని, అమరావతి అభివృద్ధి చెందితే దేశంలో నెం.1 అవుతుందనే ఆలోచనతో బీజేపీ నాయకులు భావించి ఆ తీరుగా వ్యవహరిస్తున్నారని, ప్రజలు కేంద్రం కుయుక్తులు గమనించి నడుచుకోవాలని కోరారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, బుల్లియ్య, శివకుమార్, స్టీవెన్‌బాబు, మాబు, అఖిల్, అయ్యప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా: రూరల్ సీఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 2: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు అంకిత భావంతో కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు చెప్పారు. గతంలో ఒంగోలులో సీఐగా పనిచేస్తూ బదిలిలలో భాగంగా ఆయన తెనాలి రూరల్ స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐ మాట్లాడుతూ తెనాలి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధపెడతానని నేర నియంత్రణకు అనునిత్యం కృషి చేస్తానన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలుచేస్తూ ప్రజలకు భరోసాగా నిలుస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లును పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు చేపడుతున్న రూరల్ సీఐ వెంకటేశ్వర్లు

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 2: డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ మహబూబ్ భాషా ఆదేశాల మేరకు గుంటూరు రేంజ్ ఆఫీసర్ పోతురాజు ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో జడ్పీహెచ్ స్కూల్ హెడ్మాస్టర్ పిల్లలకు వ్యాసరచన డ్రాయింగ్ చిత్తడి నేలల మీద కాంపిటీషన్ పెట్టి వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉప్పలపాడు పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్‌కుమార్, డీఆర్వో వెంకటేశ్వరరావు, బీట్ అధికారి సంతోష్, హైస్కూల్ టీచర్ టీజేఎస్ స్వరూపరాణి, మాస్టర్ పి రామారావు బహుమతులు అందచేశారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కండి

● సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

● శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ వద్దు

● పోలీస్ యంత్రాంగానికి ఎస్పీ తుషార్ డూడీ దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ, వేదికపై అదనపు ఎస్పీలు

గుంటూరు, ఫిబ్రవరి 2: రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సన్నద్ధం కావాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల విధి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికలు పూర్తయ్యేవరకు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేదన్నారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని, ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఎస్పీ సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లు, చోరీకేసు నిందితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జిల్లాలో పనిచేస్తున్న అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీసు అధికారులు, సెబ్ అదనపు ఎస్పీ వేంకటేశ్వరరావు, ఎఆర్ డీఎస్పీ శాంతకుమార్, జిల్లా సబ్ డివి జన్ పోలీసు అధికారులు, జిల్లాలోని సీఐలు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటరావు, మినిస్టీరియల్ సిబ్బం ది, ఏఆర్ ఆర్ఐలు రాజారావు, థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్, రాఘవయ్య, బ్రహ్మానందం, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు లోక్‌సభకు వెంకటరమణ

● ఉమ్మారెడ్డి తనయుడికి వైసీపీ అధిష్ఠానం ఖరారు

● కొడుకు వెంకటరమణ రాకతో.. అల్లుడు కిలారి ఔటేనా?

● ప్రస్తుతం వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన రమణ



ఉమ్మారెడ్డి వెంకటరమణ

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత శాసనమండలి సభ్యుడు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తనయుడు వెంకటరమణకు రాజకీయ ఆరంగేట్రం చేసే అవకాశం లభించింది. ఈ మేరకు వైసీపీ అధిష్ఠానం శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఆరో జాబితాలో గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఉమ్మారెడ్డి వెంకటరమణ పేరును ఖరారు చేస్తూ ప్రకటించింది. టీడీపీ హయాంలో బాపట్ల, తెనాలి లోక్‌సభ నియోజకవర్గాల నుంచి ఎంపీగా, కేంద్రమంత్రిగా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పనిచేశారు. ఆ తర్వాత వైసీపీలో చేరాక ఎమ్మెల్సీ పదవులకే పరిమితమయ్యారు. అయితే గత ఎన్నికల్లో అల్లుడు, వ్యాపారవేత్త కిలారి రోశయ్యకు ఉమ్మారెడ్డి పొన్నూరు అసెంబ్లీ టికెట్ ఇప్పించుకున్నారు. అయితే గెలుపొందిన నాటి నుంచి ఆయన అవినీతి, ఆరాచకాలపై విపక్షమే కాకుండా స్వపక్షం సైతం కోడై కూస్తున్నది. ఆయనకు తిరిగి టికెట్ ఇస్తే ఓడిస్తామని వైసీపీలోని ఓ వర్గం ఏకంగా అధిష్ఠానాన్నే హెచ్చరించింది. ఈ పరిస్థితుల్లో వైసీపీ అధిష్ఠానం ముందస్తు ఆలోచనతో ఉమ్మారెడ్డి తనయుడికి గుంటూరు ఎంపీ సీటు ఇవ్వటం ద్వారా రోశయ్యకు చెక్ పెట్టినట్లు అర్థమవుతుంది. ఒకే కుటుంబం నుంచి ఒకే పార్లమెంటు పరిధిలో ఇద్దరికి అవకాశం కల్పించటం సాధ్యం కాదనే సాకుతో రోశయ్యకు నిదానంగా అవకాశం తప్పించే అవకాశం ఉంది. కాగా వెంకటరమణ ఎంతోకాలంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు దూరంగా హైదరాబాద్‌లో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసుకుని ఉన్నారు. ఇతర వ్యాపారాలతో ఆయన అక్కడే స్థిరపడిపోయారు. పైగా వెంకటరమణకు పరిచయం ఉన్న బాపట్ల ప్రాంతం గుంటూరు జిల్లా నుంచి విడివడింది. గత ఎన్నికల్లో గుంటూరు ఎంపీగా పోటీచేసి ఘోర పరాజయం పాలైన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తిరిగి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపించకపోవటంతో, క్రియాశీలక రాజకీయాలకు కూడా దూరంగా ఉండటంతో మరొకరిని వెతుక్కోవాల్సి వచ్చింది.



రాఘవులుకు నివాళి అర్పిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

రాఘవులుకు నరేంద్ర నివాళి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 2: పొన్నూరు పట్టణానికి చెందిన 24వ వార్డు టీడీపీ సీనియర్ కార్యకర్త గున్నెమెడ రాఘవులు గురువారం రాత్రి మృతిచెందారు. రాఘవులు మృతివార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాతపొన్నూరులోని మృతుడి ఇంటికి వెళ్లి రాఘవులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాఘవులుకు తన తండ్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి హయాం నుంచి తమ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని మననం చేసుకున్నారు. రాఘవులు కుమారులను కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. రాఘవులకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ ఆలపర్తి చంద్రమోహన్, చెల్లంశెట్టి సీతరామయ్య, రాజకుమార్, టీడీపీ నాయకులు తదితరులు నివాళులు అర్పించారు.

చంద్రబాబును గెలిపించుకుందాం: అనిత



బాబు ష్యూరిటీ బాండ్లు అందిస్తున్న పార్టీ శ్రేణులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 2: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని గాడిలోపెట్టి అభివృద్ధి పథంలో నడిపించగలిగిన సత్తాకలిగిన నాయకుడు చంద్రబాబును గెలిపించుకుందామని మండల తెలుగు మహిళా కార్యదర్శి ఎనమదల అనిత చెప్పారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం మండలంలోని ఖాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్లు వంటి పథకాలపై గ్రామస్థులకు వివరించడంతో పాటు తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చి హామీలను అమలు చేస్తామని చంద్రబాబు సంతకంచేసిన ష్యూరిటీ బాండ్లను అందించారు. కార్యక్రమంలో టి. వెంకటశివన్నారాయణ, కె. సాయి సుబ్రహ్మణ్యం, కె. వెంకటనారాయణ, టి.పద్మ, టి.ఇంద్రజ, పి.భువనేశ్వరి, సీహెచ్. విజయ, టి. శ్రీలక్ష్మి, జి.ఆదిలక్ష్మి పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.



క్రీడాకారుడు వెంకటమహేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

వెయిట్ లిఫ్టర్ మహేష్‌కు అభినందనలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో తెనాలికి చెందిన క్రీడాకారుడు నర్రా వెంకట మహేష్‌కు స్వర్ణ పతకం లభించింది. ప్రతిభ చూపిన క్రీడాకారుడిని శుక్రవారం వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 73కిలోల విభాగంలో ప్రతిభ చూపాడు. వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు తేవాలని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, తాడిబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్ పంప్స్ సంస్థలో ఉద్యోగుల రక్తదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని కుమార్ పంప్స్ ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర పుట్టిన రోజు సందర్భంగా 250మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. జిల్లా వైద్యశాల వైద్యులు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పర్యవేక్షించారు. కొత్త శ్రీనివాస్, గడ్డిపాటి శేషగిరిరావు, కొత్త హరికుమార్, డాక్టర్ రాధాబాయి, ముమ్మనేని భానుమతి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సుబ్రహ్మణ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి: మురళీకృష్ణ



ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ, చంద్రమౌళి తదితరులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 2: పట్టణ ప్రజలను ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ కోరారు. స్థానిక ఐతానగర్, లింగారావు సెంటర్ సచివాలయం పరిధిలోని యడ్లపాటి వెంకట్రావు కాలనీలో శుక్రవారం మలేరియా సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా జిల్లా అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లతే సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ వైద్యశాలలో జ్వర నిర్ధారణ పరీక్షలను చేయించుకొని మందులను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. అనంతరం ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో యూఎల్‌బీ విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి, రూరల్ సబ్ యూనిట్ అధికారి పున్నారెడ్డి, శివగణేష్, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరావు, నవీద్, రషీద్, వార్డు హెల్త్‌సెక్రటరీ వి.అనిత, ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పక్షోత్సవాలలో భాగంగా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సొసైటీ కో-ఆర్డినేటర్ రాధిక, వహిబ్ బాషా పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ



పిడపర్రు పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 2: విద్యార్థులకు క్రమ శిక్షణతో విద్యనందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావులూరు, పిడపర్రు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లోని రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు



తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 1: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకుడు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు మాదల కోటేశ్వరావు తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో శుక్రవారం నన్నపనేని చిన్న సుబ్బారావు వర్ధంతి సందర్భంగా వారి కటుంబసభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.రమేష్, ఎస్.సాంబశివరావు, జి.రమేష్, ముళ్ళపూడి వెంకట్, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గుమ్మడి ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నిత్యసహాయ మాత ఊరేగింపులో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవులు

ఘనంగా నిత్యసహాయ మాత మహోత్సవాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: చెంచుపేటలోని నిత్యసహాయ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జనవరి 24నుంచి జరుగుతున్న ఉత్సవాలలో ప్రతిరోజూ ప్రార్థనలు, ఆశీర్వాదం, దివ్యబలిపూజ, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిపారు. గుంటూరు పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ పి.చిన్నయ్య వాక్య సందేశం ఇచ్చారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో నిత్యసహాయ మాతను ఊరేగించారు. దివ్య బలిపూజ కార్యక్రమాన్ని ఫాదర్ విన్సెంట్ నిర్వహించారు. మఠవాస జీవిత స్వర్ణ జూబిలీ జరుపుకున్న గురువులను సన్మానించారు. ఉత్సవాలను కోయస్లీవ, ఆంథోని విన్సెంట్, విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.



పారిశుధ్య పనులను పరిశీలించేందుకు వచ్చిన కమిషనర్ శేషన్న

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పరిశీలించారు. కొత్తపేట, నాజరుపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. వ్యర్థాల సేకరణ, తడి, పొడి చెత్త విభజించే విధానం, గృహాలలో హోమ్ కంపోస్టు పాటించడం వంటి విధానాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఎక్కడా కూడా పారిశుధ్య లోపాలు తలెత్తకుండా చూడాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం పర్యవేక్షించాలని నిబంధనలు పాటించని వారికి జరిమానా వేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, కుళాయిలకు నిర్ణీత వేళల్లో నీటిని విడుదల చేయాలని, లీకేజీలను తక్షణమే నివారించాలన్నారు. శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలు ఎంపీడీవోగా జ్యోతి బాధ్యతల స్వీకారం

చేబ్రోలు, ఫిబ్రవరి 2: చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా కె జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా చెందర్లపాడు ఎంపిడివో గా పనిచేస్తున్న జ్యోతి చేబ్రోలు ఎంపిడివోగా బదిలిపై వచ్చారు. చేబ్రోలు ఎంపిడివోగా పనిచేసిన బి బాబురావు ప్రకాశం జిల్లా బదిలిపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతిని ఈవోపిఆర్‌డి శ్రీనివాసరావు, ఏవో ఉమాదేవి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



చేబ్రోలు ఎంపీడీవో జ్యోతి

దుకాణాలను నమోదు చేసుకోవాలి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని దుకాణాలు, సంస్థలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సహాయ కార్మిక కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. చట్టం ప్రకారం... నమోదు చేయించాల్సిన విధానాన్ని శుక్రవారం మారీసుపేటలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించి వివరించారు. పలు వ్యాపార సంస్థల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.